
సాక్షి ఒడిశా

సోమవారం । 5 । జూన్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం ఆదివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,76,837లు, బంగారం9.7 గ్రాములు, వెండి 72 గ్రాములు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



దేదీప్యమానం.. దేవస్నానం

- 8లో



సేవలు షురూ..

భువనేశ్వర్: బహనాగా బజార్ రైల్వేస్టేషన్ మీదుగా రైలు సేవలు పునః ప్రారంభమయ్యాయి. ఆదివారం రాత్రి10.40 గంటల నుంచి డౌన్‌లైన్‌లో రైళ్ల రాకపోకలకు అనుమతి లభించింది. అప్‌లైన్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు పనులను రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్ పర్యవేక్షిస్తున్నారు.

న్యూస్‌రీల్

బండారు ఘరణిని దర్శించుకున్న ఎంపీ



ఆలయ ప్రాంగణంలో కుటుంబ సమేతంగా ఎంపీ సప్తగిరి

కొరాపుట్: నవరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని శక్తిపీఠం బండారు ఘరణి అమ్మవారిని కొరాపుట్ పార్లమెంట్ సభ్యుడు సప్తగిరి ఉల్క ఆదివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. తన భార్య, ఇద్దరు చిన్నారులతో కలిసి ఇక్కడికి చేరుకున్న ఆయన.. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు పపడాహండి సాయిధ స్థూపం వద్ద అమరులకు నివాళులర్పించారు. ఎటువంటి పార్టీ కార్యక్రమం లేకపోయినప్పటికీ వ్యక్తిగతంగా ఆయన పర్యటించారు. పలుచోట్ల స్థానిక కాంగ్రెస్ శ్రేణులు సప్తగిరిని గౌరవపూర్వకంగా కలిశారు.

కలుషితాహార బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ



రోగులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పీతం పాఢి

కొరాపుట్: జిల్లాలోని దుదారి పంచాయతీలో కలుషిత ఆహారం తిని, అనారోగ్యం పాలైన బాధితులను పొట్టంగి ఎమ్మెల్యే పీతం పాఢి పరామర్శించారు. ఆదివారం వేకువజామున అధిక సంఖ్యలో గిరిజనలు వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురయ్యారు. సమాచారం అందుకున్న అధికారులు.. వెంటనే రంగంలోకి దిగి బాధితులను సునాబెడా, మలతాపుట్ ప్రభుత్వ ఆస్పత్రులకు తరలించి, చికిత్స ప్రారంభించారు. గ్రామంలో శనివారం రాత్రి జరిగిన విందు కార్యక్రమంలో భోజనం చేసిన 77మంది అనారోగ్యానికి గురైనట్లు గుర్తించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే.. ఆయా ఆస్పత్రులకు చేరుకుని పరామర్శించి, ధైర్యం చెప్పారు. వారి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

గంజాయితో నలుగురి అరెస్ట్



గంజాయితో పట్టుబడిన నిందితులు

మల్కన్‌గిరి: జిల్లాలోని మల్కన్‌గిరి సమితి పద్మగిరి కూడలి వద్ద ఆదివారం ఉదయం పెట్రోలింగ్ నిర్వహిస్తున్న మల్కన్‌గిరి ఎస్‌ఐ అమిత్‌కుమార్, సిబ్బంది.. అక్రమంగా తరలిస్తున్న 60కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి నిందుతులు సుందర్ కీలో(19), ధనుంజయ్ కీలో(20), చేతన్ దిగ్‌పరి(19), దేబాశీస్ దేయి(22) లపై కేసు నమోదు చేసి, అరెస్ట్ చేశారు. వీరిని సోమవారం ఉదయం కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.5 లక్షలు ఉంటుందని వెల్లడించారు. నిందితుల నుంచి ఓ ద్విచక్ర వాహనం, రూ.17,100ల నగదు స్వాధీనం చేసుకున్నారు.

మృతులకు నివాళులు..



నివాళులర్పిస్తున్న మంత్రి సరక, నాయకులు

రాయగడ: బహనాగా బజార్ రైల్వేస్టేషన్ వద్ద చోటు చేసుకున్న ఘోర రైలు ప్రమాదంలో మృతిచెందిన వారికి బీజేడీ జిల్లా శ్రేణులు శ్రద్ధాంజలి ఘటించారు. పట్టణంలోని గాంధీ పార్క్ వద్ద శనినవారం రాత్రి ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమశాఖ మంత్రి జగన్నాథ సరక, బీజేడీ జిల్లా అధ్యక్షుడు సుధీర్ దాస్, ఎస్‌డీసీ చైర్‌పర్సన్ అనసూయ మాఝి తదితరులు పాల్గొన్నారను. ప్రగాఢ సంతాపం తెలియజేస్తూ కొవ్వొత్తులు వెలిగించారు. యువ, మహిళా నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



కొవ్వొత్తులు వెలిగిస్తున్న మహిళలు

చురుగ్గా..పునరుద్ధరణ

- బహనాగా బజార్‌లో సహాయక చర్యలు ముమ్మరం చేసిన రైల్వేశాఖ
- ఆదివారం సాయంత్రానికి 88మృతదేహాల గుర్తింపు
- మిగిలిన వాటిని బాలేసోర్, భువనేశ్వర్ మార్చురీలకు తరలింపు
- బాధితులు, కుటుంబీలకు ఉచిత బస్సు సర్వీసులు ఏర్పాటు



యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్న ట్రాక్ పునరుద్ధరణ పనులు

భువనేశ్వర్: బహనాగా బజార్ రైల్వేస్టేషన్ ప్రాంతం కోరమండల్ ఎక్స్‌ప్రెస్ రైలు దుర్ఘటన ప్రాంతంలో పునరుద్ధరణ పనులు యుద్ధ ప్రాతిపదికన నిర్వహిస్తున్నారు. ఘటనా స్థలంలో రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రత్యక్షంగా ఈ పనులను పర్యవేక్షిస్తున్నారు. మరోవైపు మృతదేహాల తరలింపునకు అత్యంత ప్రాధాన్యత కల్పిస్తున్నారు. బాధిత కుటుంబాలను ఆదుకోవడం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. రాష్ట్రప్రభుత్వం ఈ నేపథ్యంలో సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగుతోంది. ఉచిత బస్సు రవాణా సదుపాయం కల్పించింది. మృతులు, క్షతగాత్రులకు పరిహారం చెల్లింపు చర్యలు చురుగ్గా సాగుతున్నాయి.

లెక్క తేలింది..

రైల్వేశాఖ సమాచారం ఆధారంగా కోరమండల్ ఎక్స్‌ప్రెస్ రైలు దుర్ఘటనలో మృతుల సంఖ్య శనివారం రాత్రి 288గా ప్రకటించారు. దుర్ఘటనకు గురైన చిట్టచివరి బోగీ పునరుద్ధరించిన తర్వాత లెక్కించిన మేరకు తుది వివరాలను దాఖలు చేసినట్లు రైల్వేశాఖ పేర్కొంది. అయితే ఆదివారం ఉదయం వరకు అంచెలంచెలుగా అందిన మృతదేహాలను ఒకటికి రెండుసార్లు లెక్కించడంతో మృతుల సంఖ్య 261గా ప్రకటించాం. రైల్వేశాఖ మృతుల సంఖ్య 288గా పేర్కొనడంతో రాష్ట్రప్రభుత్వం ఇదే సంఖ్యను ప్రకటించిందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌కుమార్ జెనా స్పష్టం చేశారు. కొన్ని సందర్భాల్లో ఒక్కో మృతదేహం రెండుసార్లు చొప్పన లెక్కించడంతో గణాంకాల్లో గందరగోళం చోటు చేసుకుందని వివరించారు. ఆస్పత్రులకు మృతదేహాలను క్షుణ్ణంగా పరిశీలించిన మేరకు లెక్కించడంతో తాజా మృతుల సంఖ్య 275గా తేలిందన్నారు. జిల్లా కలెక్టర్ లిఖితపూర్వకంగా ఈ సంఖ్యని ధ్రువీకరించారని తెలిపారు. ఇక మృతుల సంఖ్యలో తేడాలు చోటు చేసుకునే అవకాశం లేదన్నారు. ఘటనా స్థలంలో సహాయక చర్యలు పూర్తయి.. మృతదేహాలు, బాధితుల గుర్తింపు ముగిసినందున ఇకపై వ్యత్యాసం ఉండదని వివరించారు. అలాగే ఆదివారం సాయంత్రానికి 78 మృతదేహాలను బంధువులకు అప్పగించడం పూర్తయ్యిందని సీఎస్ వెల్లడించారు. మరో 10 మృతదేహాల గుర్తించామని, అప్పగింత ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఈ లెక్కన సమగ్రంగా 88 మృతదేహాలను గుర్తించగా.. 17 మృతదేహాలు బాలాసోర్‌కు, మిగిలిన వాటిని భువనేశ్వర్‌లోని మార్చురీకి తరలించినట్లు ప్రకటించారు.

భద్రంగా తరలింపు..

దుర్ఘటనలో దుర్మరణం పాలైన మృతదేహాలను గౌరవ ప్రదంగా తరలించేందుకు ఏర్పాట్లు చేశామని సీఎస్ ప్రదీప్ జెనా తెలిపారు. ఘటనా స్థలం నుంచి పలు చోట్ల అందుబాటులో ఉన్న శవాగారాలకు తరలించడంలో అందుబాటులో ఉన్న మాధ్యమాలను పరిశీలించిన మేరకు అంబులెన్సుల్లో తరలించడం శ్రేయోదాయకంగా భావిస్తున్నామన్నారు. ట్రక్కులు లేదా ప్రత్యేక రైలు ద్వారా తరలించేందుకు సైతం యోచిస్తున్నామని ప్రకటించారు. రైలులో రవాణాకు కేబినెట్ కార్యదర్శి అనుమతి లభించిందని, అయితే గౌరవప్రదంగా ఉండదని భావించి అంబులెన్సుల్లో తరలించామన్నారు. ఒక్కో అంబులెన్స్‌లో 2చొప్పున 85 వాహనాల్లో భువనేశ్వర్‌కు చేరవేశామని వివరించారు.

రూ.3.22 కోట్ల పరిహారం చెల్లింపు

బాధితులు, కుటుంబాలకు ముందుగా ప్రకటించిన పరిహారం వెంటనే అందేలా చర్యలు చేపడుతున్నామని రైల్వేమంత్రి హామీ ఇచ్చారు. మృతుల కుటుంబీకులకు రూ.10 లక్షలు, తీవ్ర గాయాల పాలైన వారికి రూ.2 లక్షలు, స్వల్ప గాయాల బాధితులకు రూ.50వేలు చొప్పున చెల్లింపు కొనసాగుతోంది. ఇప్పటి వరకు రైల్వేశాఖ 285 కేసుల్లో రూ.3.22 కోట్లు చెల్లించింది. ఇందులో 11 మరణాలు, 50 తీవ్రమైన గాయాలు, 224 సాధారణ గాయాల బాధితులు ఉన్నారు. సారో, ఖరగ్‌పూర్, బాలాసోర్, ఖంటపడా, భద్రక్, కటక్, భువనేశ్వర్ తదితర 7 ప్రాంతాల్లో చెల్లింపులకు ప్రత్యేక కేంద్రాలు పని చేస్తున్నాయి.

మృతులకు రూ.5 లక్షలు: సీఎం

దుర్ఘటనలో దుర్మరణం పాలైన రాష్ట్రానికి చెందిన వారి కుటుంబీకులకు రూ.5 లక్షలు, తీవ్రంగా గాయపడిన వారికి రూ.లక్ష పరిహారాన్ని ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ప్రకటించారు. వీటిని వీలయినంత త్వరలో బాధిత కుటుంబాలకు అందజేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. గుర్తింపు ప్రక్రియ పూర్తయిన వెంటనే పంపిణీ చేసేందుకు యోచిస్తున్నారు.

ప్రధానితో మాటామంతీ..

ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఆదివారం ప్రధాన మంత్రి నరేంద్రమోదీతో ఫోన్‌లో మాట్లాడి, తాజా పరిస్థితులు రైలు ప్రమాద బాధితుల చికిత్స గురించి వివరించారు. గాయపడిన ప్రయాణికుల ప్రాణాలను కాపాడేందుకు వివిధ ఆస్పత్రుల్లో అన్ని చర్యలు తీసుకున్నామని హామీ ఇచ్చారు. వైద్యులు, వైద్య విద్యార్థులు బాధితుల ప్రాణాలను కాపాడేందుకు తమవంతు కృషి చేస్తున్నారని తెలిపారు. గాయపడిన వారికి రక్తదానం చేసేందుకు వైద్యులు, విద్యార్థులు, సామాన్యులు ముందుకు వస్తున్నారని ప్రధానికి వివరించారు.

లోకో పైలట్ క్షేమం: ఎల్‌ఆర్‌ఎస్‌ఏ



భువనేశ్వర్ అమ్రి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న లోకోపైలట్ జీఎన్ మహంతి

బాలాసోర్ జిల్లా బహనాగా బజార్ స్టేషన్ కోరమండల్ ఎక్స్‌ప్రెస్ రైలు దుర్ఘటనలో గాయపడిన లోకోపైలట్ జీఎన్ మహంతి సురక్షితంగా చికిత్స పొందుతున్నాడు. ఆయన ప్రాణానికి ఎటువంటి ముప్పు లేనట్లు వైద్యవర్గాలు భరోసా ఇచ్చాయి. ఈ నేపథ్యంలో కొన్ని మీడియా సంస్థలు, టీవీ ఛానెళ్లు మృతి చెందినట్లు తప్పుడు ప్రసారం చేసి, అవాంఛిత ఆందోళన ప్రేరేపిస్తున్నారని అఖిల భారత లోకో రన్నింగ్ సిబ్బంది సంఘం(ఏఐఎల్‌ఆర్‌ఎస్‌ఏ) ఖుర్దారోడ్ శాఖ ప్రధాన కార్యదర్శి జేపీ దండపట్ 'సాక్షి'కి తెలిపారు. తోటి సిబ్బంది ఆరోగ్య పరిస్థితి తెలుసుకునేందుకు ఆయన ఆస్పత్రిని ఆదివారం ప్రత్యక్షంగా సందర్శించారు. లోకోపైలట్ తోపాటు మిగతా సిబ్బంది అమ్రి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో బాగోగులు పర్యవేక్షించేందుకు సందర్శించినట్లు పేర్కొన్నారు. దుర్ఘటనలో మహంతి పక్కటెముక విరగడం కారణంగా ఛాతీలో నొప్పిగా ఉందని తెలిపినట్లు వివరించారు.

నోడల్ అధికారుల సంప్రదింపులకు ఫోన్ నంబర్లు
రాజేష్ ప్రధాన్ 6370946287
ఆసిష్ పత్ర 7978095293
దేబాసిష్ మిశ్రా 6370585221
దీపక్‌కుమార్ రూట్ 8249217415
సందీప్ మోహరానా 8847822559

నేటి నుంచి సీఆర్‌ఎస్ విచారణ..

బహనాగా బజార్ స్టేషన్ వద్ద రెండు రోజుల క్రితం జరిగిన ట్రిపుల్ రైలు ప్రమాదంపై రైల్వే భద్రత(ఆగ్నేయ సర్కిల్) కమిషనర్ సోమవారం నుంచి విచారణ ప్రారంభించనున్నారు. ఖరగ్‌పూర్‌లోని సౌత్ ఇనిస్టిట్యూట్‌లో కమిషనర్ సోమ, మంగళవారాల్లో రెండు రోజుల పాటు శాఖాపరమైన విచారణ జరుపుతారని రైల్వేవర్గాలు ఆదివారం తెలిపాయి. షాలీమార్-చెన్నై సెంట్రల్ కోరమండల్(12841) ఎక్స్‌ప్రెస్, ఎస్ఎంవీటీ బెంగళూర్-హౌరా(12864) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పిన ఘటనకు సంబంధించి సోమవారం ఉదయం 9 గంటలకు విచారణ ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఈ సమయంలో రైలు వినియోగదారులు, స్థానిక ప్రజా, ఇతర సంస్థలు ప్రమాదానికి సంబంధించిన ఏదైనా సమాచారానికి సంబంధించి కమిషన్ ముందు ప్రవేశ పెట్టవచ్చని సూచించారు. ఈ దుర్ఘటనలో 275మంది ప్రయాణికులు మరణించగా, 1,175 మంది గాయపడ్డారు.



ఎస్సీబీని సందర్శించిన కేంద్రమంత్రులు..

రైలు ప్రమాదంలో గాయపడిన ప్రయాణికుల చికిత్స, యోగక్షేమాలను రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్, కేంద్ర ఆరోగ్యశాఖా మంత్రి మన్‌సుఖ్ మాండవియా, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కటక్ ఎస్‌సీబీ మెడికల్ కళాశాల ఆస్పత్రిని సందర్శించారు. చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. సీనియర్ వైద్యులు, అధికారులతో మాట్లాడి క్షతగాత్రులకు వైద్యం అందించేందుకు చేసిన ఏర్పాట్లను పరిశీలించడంతో పాటు సరైన చికిత్స అందించేందుకు అవసరమైన సూచనలు చేశారు. ప్రతి ప్రాణాన్ని రక్షించడంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని గుర్తుచేశారు. ఈ సందర్భంగా కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి మాట్లాడుతూ గాయపడిన వారికి చికిత్స చేయడంలో సహాయ పడేందుకు ఢిల్లీలోని మూడు ప్రీమియర్ ఆస్పత్రుల నుంచి వైద్య నిపుణులు, అత్యాధునిక పరికరాలు, మందులు తెప్పించామని తెలిపారు. 100మందికి పైగా రోగులకు క్రిటికల్ కేర్ అవసరమని గుర్తించామన్నారు. అంతకుముందు ఆయన భువనేశ్వర్ ఎయిమ్స్‌ను సందర్శించారు. రైలు ప్రమాదంలో మరణించిన వారి మృతదేహాల నిర్వహణ వ్యవస్థను పరిశీలించారు.

వెబ్‌సైట్‌లో వివరాలు..

వివిధ ఆస్పత్రులలో చికిత్స పొందుతున్న బాధిత ప్రయాణికుల పూర్తి వివరాలను అందుబాటులోకి తెచ్చారు. పలు వెబ్‌సైట్‌లలో వీటిని అప్‌లోడ్ చేశారు. వివరాలతో బాధితుల ఫొటోల్ని జోడించడం విశేషం. ఈ వివరాల వినియోగం పట్ల ప్రత్యేక ఆంక్షలు విధించారు. srcodisha.nic.in, bmc.gov.in అలాగే osdma.org వెబ్‌సైట్‌లో ఫొటోలు, ప్రాథమిక వివరాలు పొందుపరిచారు.

ఆంక్షలు..

వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసిన బాలాసోర్ రైలు ప్రమాదంలో మృతుల ఫొటోలు బంధువర్గాలు గుర్తించేందుకు మాత్రమే పరిమితం. ప్రమాదంలో తీవ్రత దృష్ట్యా పోస్ట్ చేసిన చిత్రాలు కలవర పరుస్తున్నాయి. పిల్లలు ఈ చిత్రాలను చూడకుండా నివారించాలని ఆంక్షలు జారీ చేశారు. ఈ సమాచారం వినియోగంలో వీక్షకులు విచక్షణతో సద్వినియోగ పరచుకోవాలి. రాష్ట్ర ప్రత్యేక సహాయ కమిషనర్(ఎస్ఆర్‌సి) ముందస్తు రాతపూర్వక అనుమతి లేకుండా మీడియా/వ్యక్తిగతం/సంస్థలు మొదలైనవి వెబ్‌సైట్‌లో ఈ చిత్రాల ప్రచురణ తదితర అవసరాలకు ఎట్టి పరిస్థితుల్లో వినియోగించరాదు.

బీఎంసీ హెల్ప్‌లైన్ నంబర్-1929

ఈ దిగువ ప్రాంతాల ప్రవేశ ద్వారాల వద్ద హెల్ప్‌డెస్కులు ఏర్పాటు చేశారు.

- కటక్ రైల్వేస్టేషన్, బస్టాండ్, ఎస్‌సీబీ మెడికల్ కళాశాల ఆస్పత్రి.
- భువనేశ్వర్ రైల్వేస్టేషన్, బరముండా బస్టాండ్, విమానాశ్రయం.

కంట్రోల్ రూమ్

భువనేశ్వర్ మున్సిపల్ కమిషనర్(బీఎంసీ) కార్యాలయం ప్రాంగణంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. బాధితుల బంధువర్గాలు ఆస్పత్రి లేదా మార్చురీకి వెళ్లేందుకు సహాయ సహకారాలు అందజేయడంలో ఈ వ్యవస్థ దోహదపడుతుందన్నారు. ఈ సౌకర్యాలు కల్పించేందుకు ప్రత్యేకంగా నోడల్ అధికారులను నియమించారు.

ప్రత్యేక రైలు..

12841 అప్ షాలీమార్-చెన్నై కోరమండల్ ఎక్స్‌ప్రెస్ మార్గంలో మధ్యాహ్నం 1 గంటకు భద్రక్ నుంచి చెన్నైకి ప్రత్యేక రైలు బయల్దేరింది. ఇది కటక్, భువనేశ్వర్ ఖుర్దారోడ్ మీదుగా నడుస్తుంది. ప్రమాదంలో చిక్కుకుపోయిన ప్రయాణికులు, బంధువులు ఈ రైలు సేవను పొందవచ్చని రైల్వేమంత్రి వైష్ణవ్ తెలిపారు. ఘటనా స్థలం పునరుద్ధరణ పనుల్లో 1000మంది సిబ్బంది అవిశ్రాంతంగా పని చేస్తున్నారని, 7 పొక్లెయినర్‌లు, 2 యాక్సిడెంట్ రిలీఫ్ రైళ్లు, 4 రైల్వే, రోడ్ క్రేన్‌లు పునరుద్ధరణ పనుల్లో వినియోగిస్తున్నట్లు వివరించారు.

76బస్సుల్లో 3,800మంది..

దుర్ఘటన కారణంగా రైలు సేవలకు అంతరాయం ఏర్పడిన దృష్ట్యా, ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ పూరీ, భువనేశ్వర్, కటక్ నుంచి కోల్‌కతాకు ఉచిత బస్సు సేవలను ప్రకటించారు. మొత్తం ఖర్చు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి భరించనున్నారు. అలాగే బాలేశ్వర్ మార్గంలో సాధారణ రైలు సేవలను పునరుద్ధరించే వరకు ఈ సౌకర్యం కొనసాగుతుంది. ప్రమాదంలో చిక్కుకుపోయిన ప్రయాణికులకు సహాయం చేసేందుకు కటక్ నుంచి చండీఖోల్, భద్రక్, బాలాసోర్ వరకు ఉచిత బస్సు సేవలు కూడా ప్రారంభమయ్యాయి. ఇప్పటివరకు 76బస్సుల్లో సుమారు 3,800మంది ప్రభావిత ప్రయాణికులను కటక్ రైల్వేస్టేషన్ నుంచి సురక్షితంగా గమ్యస్థానాలకు తరలించారు.



ఉచిత బస్సుల్లో గమ్య స్థానాలకు తరలి వెళ్తున్న బాధిత ప్రయాణికులు

రాత్రింబవళ్లు అక్కడే..

కొరాపుట్: బాలేశ్వర్ రైలు దుర్ఘటన జరిగిన ప్రాంతంలో ట్రాక్ పునరుద్ధరణ పనులు యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయి. ఆదివారం సాయంత్రానికి దాదాపు 70శాతం పనులు పూర్తయ్యాయి. రాష్ట్రానికి చెందిన కేంద్ర రైల్వేమంత్రి అశ్వినీ శ్రీవైష్ణవ్, మరో కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌లు అక్కడే మకాం వేశారు. దేశవ్యాప్తంగా రైల్వే ట్రాక్ పునరుద్ధరణలో ఉన్న అత్యంత నాణ్యమైన టెక్నాలజీ వినియోగించారు. వందల సంఖ్యలో రైల్వే కార్మికులు షిఫ్ట్‌ల వారీగా పనులు చేస్తున్నారు. మరోవైపు ఇద్దరూ మంత్రులు భద్రక్ జిల్లా కేంద్ర ఆస్పత్రిని సందర్శించి బాధితులను పరామర్శించారు. అలాగే రాష్ట్ర ముఖ్య కార్యదర్శి ప్రతాప్ జెన్నా మీడియా మాట్లాడుతూ మొత్తం 275మంది మృతులు తుది ప్రకటన చేశారు. ప్రతి మృతదేహాన్ని రాష్ట్ర ఖర్చులతో వారి స్వస్థలాలకు పంపిస్తున్నామన్నారు. బంధువులకు అప్పగించని మృతదేహాలను అన్ని ఆస్పత్రుల నుంచి భువనేశ్వర్‌కు రప్పిస్తున్నామన్నాని తెలిపారు. ఏ రాష్ట్రానికి చెందిన మృతులు ఉన్నా.. వారి బంధువులు వస్తే డెత్ సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. మృతదేహాలను ఫొటోలు తీసి, ప్రదర్శనగా ఉంచారు. బాధిత కుటుంబం సభ్యులు ఫొటో గుర్తించిన వెంటనే అధికారులు ఆ ఫొటో నంబర్ చూసి బాధితులను మృతదేహం ఉన్న ఆస్పత్రికి తీసుకు వెళ్తున్నారు. వెనువెంటనే తరలింపు ప్రక్రియ చేపడుతున్నారు.

అందుకే.. అంత వేగంగా..


కేంద్ర రైల్వేమంత్రి అశ్విని శ్రీవైష్ణవ్ పనితీరు అందరినీ ఆశ్చర్యంలో ముంచింది. ఘటన జరిగిన వెంటనే హుటాహుటిన ప్రమాద ప్రాంతానికి చేరుకున్న ఆయన.. అప్పటి నుంచి విశ్రాంతి లేకుండా అక్కడే మకాం వేశారు. పగలు, రాత్రీ తేడా లేకుండా పరుగులు పెడుతూ సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. స్వయాన రైల్వేమంత్రే ఘటన స్థలంలో తిష్ట వేయడంతో ఆ శాఖలో ఉన్నతాధికారులెవరూ అక్కడి నుంచి కదల్లేకపోయారు. ఈ నేపథ్యంలో శిథిలమైన బోగీలులను తరచూ సందర్శిస్తూ, ట్రాక్ పునరుద్ధరణ పనులు వేగవంతం చేయిస్తున్నారు. మరోవైపు మృతదేహాల తరలింపు పూర్తయినప్పటికీ కొన్ని బోగీల కింద ఇంకా ఎవరైనా ఉన్నారనే అనుమానంతో పూర్తిస్థాయిలో తొలగింపు ప్రక్రియ కొనసాగిస్తున్నారు. మరోవైపు సహాయక చర్యల్లో అందరి మన్ననలు పొందిన ఎన్‌డీఆర్‌ఎఫ్ దళాలు చెట్ల కిందే సేద తీరుతున్నాయి. రైళ్ల రాకపోకలు నిలిచి పోవడంతో ముఖ్యమంత్రి నవీన్ పట్నయక్ ఉచిత బస్సు సర్వీసులు నడపాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఈ పరిహారాన్ని బస్సు యజమానులకు చెల్లిస్తామన్నారు. ఈ బస్సులు బాలేశ్వర్, పూరీ, కోల్‌కతా, భువనేశ్వర్, కటక్ మధ్య రాకపోకలు సాగిస్తున్నాయి.



యూటీవీ నుంచి విద్యుత్‌లైన్ సరిచేస్తున్న రైల్వే సిబ్బంది



రైల్వేమంత్రి అశ్విని శ్రీవైష్ణవ్‌తో రైల్వే ఉన్నతాధికారులు



భద్రక్ ఆస్పత్రిలో బాధితులను పరామర్శిస్తున్న కేంద్రమంత్రులు వైష్ణవ్, ధర్మేంద్ర



ఘటనా స్థలంలో సేద తీరుతున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ దళాలు

క్లుప్తంగా

జనరల్ నర్సింగ్ కోర్సులకు ఉచిత శిక్షణ

పార్వతీపురం టౌన్: ఇంటర్‌మీడియట్ ఉత్తీర్ణులైన మహిళా అభ్యర్థులు కిమ్స్ నర్సింగ్ ఆఫ్ ఒంగోలు కళాశాలలో జనరల్ నర్సింగ్ కోర్సు ఉచిత శిక్షణకు అర్హులని కళాశాల ఎగ్జిక్యూటివ్ ఎస్ శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కన్వీనర్ కోటాలో ఉచితంగా శిక్షణ అందజేస్తామన్నారు. మొదటి సంవత్సరం పూర్తయిన తరువాత రెండవ సంవత్సరం నుంచి రూ. 7 వేలు స్టైపెండ్ ఇస్తామని తెలిపారు. ఉచిత హాస్టల్ సదుపాయం ఉందని ఆసక్తి ఉన్నవారు ఈ నెల 21వ తేదీలోపు కళాశాల వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఫోన్ 9398917283, 7020408565 నంబర్లను సంప్రదించాలని వివరించారు.

8న విశాఖలో వాలీబాల్ జట్ల ఎంపిక

విజయనగరం: జాతీయస్థాయిలో జరగనున్న ఆలిండియా ట్రైబల్ వాలీబాల్ పోటీల్లో పాల్గొనబోయే రాష్ట్ర జట్టు ఎంపిక పోటీలు ఈనెల 8వ తేదీన నిర్వహించనున్నట్లు జిల్లా వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి టీవీ భగవాన్ దాస్ తెలిపారు. ఆ రోజు ఉదయం 8 గంటల నుంచి 11గంటల వరకు విశాఖలోని రైల్వే గ్రౌండ్స్‌లో జరిగే ఎంపిక పోటీల్లో ట్రైబల్ క్రీడాకారులు మాత్రమే పాల్గొనేందుకు అర్హులని పేర్కొన్నారు. క్రీడాకారులు విధిగా కుల ధ్రువీకరణ పత్రంతో పాటు ఆధార్‌కార్డు వెంట తీసుకువెళ్లాలని సూచించారు. ఆ రోజు రాష్ట్ర జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఈనెల 9 నుంచి 12వ తేదీ వరకు భువనేశ్వర్‌లో జరగనున్న జాతీయ పోటీలకు హాజరవుతారన్నారు.

బాలేశ్వర్‌కు నాలుగు అంబులెన్సులు



108 అంబులెన్సుల జిల్లా మేనేజర్ మన్మథరావు

పార్వతీపురం టౌన్: ఒడిశా రాష్ట్రంలోని బాలేశ్వర్‌లో జరిగిన రైలు ప్రమాద బాధితుల సహాయం నిమిత్తం పార్వతీపురం మన్యం జిల్లా నుంచి నాలుగు అంబులెన్సులను పంపించినట్లు 108 అంబులెన్సుల జిల్లా మేనేజర్ మన్మథరావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ క్షతగాత్రులను వైద్యశాలలకు తరలించేందుకు, వారికి వైద్య సాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అంబులెన్సులను పంపించామన్నారు. వైద్యసేవలు అందించేందుకు ఇతర రాష్ట్రానికి అంబులెన్సులు పంపించేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అభినందనీయమన్నారు.

ఆటోను ఢీకొన్న కారు: పలువురికి గాయాలు

పార్వతీపురం/సీతానగరం: ప్రయాణికులతో వెళ్తున్న ఆటోను కారు ఢీకొనడంతో సీతానగరం మండలంలో ఆదివారం పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. సీతానగరం మండలంలోని జోగింపేటకు చెందిన సొంబరిక లక్ష్మి, భర్త కిరణ్‌తో కలిసి సొంత ఆటోలో జోగింపేటనుంచి కాశీపేటకు వెళ్తుండగా, మార్గమధ్యంలో కొంతమంది ప్రయాణికులు ఆటో ఎక్కారు. ఈ రహదారి పరిధిలో చినభోగిలి వద్దకు ఆటో వచ్చేసరికి బొబ్బిలి నుంచి పార్వతీపురం వెళ్తున్న కారు బలంగా ఢీకొట్టింది. దీంతో కారు ముందుభాగం నుజ్జు నుజ్జు కాగా, ప్రయాణికులతో ఉన్న ఆటో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ కిరణ్, గెడ్డలుప్పికి చెందిన అల్లు లక్ష్మి, బొంగల సంజీవినాయడు, కారు డ్రైవర్ సందీప్‌కుమార్, కారులో ఉన్న బి.ఇందిరకు పలుచోట్ల తీవ్ర గాయాలయ్యాయి. ఈ మేరకు క్షతగాత్రులను 108 వాహనంద్వారా పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి చికిత్సకోసం తరలించారు.

కొట్లాటలో ఒకరికి..

పార్వతీపురం: ఇద్దరి వ్యక్తుల మధ్య జరిగిన వాగ్వాదం కొట్లాటకు దారి తీయడంతో ఓ వ్యక్తి గాయాలపాలయ్యాడు. పార్వతీపురం మండలం తాళ్లబురిడి గ్రామానికి చెందిన చింతల ప్రసాద్..అదే గ్రామానికి చెందిన చింతల లక్ష్మణరావు శనివారం రాత్రి ఆంజనేయ స్వామి గుడివద్ద వాగ్వాదానికి దిగారు. నామీద డబుల్‌మీనింగ్ డైలాగ్‌లు మాట్లాడుతున్నావంటూ ప్రసాద్ చేతిని లక్ష్మణరావు నులిపివేసి చొక్కా చించివేశాడు. ఈ ఘటనలో ప్రసాద్ చేతికి తీవ్ర గాయమైంది.

జాతీయ టెన్నికాయిట్ పోటీలకు రాష్ట్ర జట్ల ఎంపిక

విజయనగరం: జాతీయస్థాయిలో జరగనున్న టెన్నికాయిట్ పోటీల్లో పాల్గొనబోయే రాష్ట్ర జట్ల ఎంపికలు ఆదివారం విజయనగరంలో నిర్వహించారు. జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని కస్పా కార్పొరేషన్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో వివిధ జిల్లాలకు చెందిన 50 మంది బాల, బాలికలు పాల్గొన్నారు. ఎంపిక పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 6గురు బాలురు, 6 గురు బాలికలను రాష్ట్ర జట్టులోకి ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 16 నుంచి తమిళనాడులో జరగబోయే జాతీయ స్థాయి పోటీలకు రాష్ట్ర జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించనున్నట్లు జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ ఛైర్మన్ నడిపేన శ్రీనివాసరావు, అధ్యక్షుడు డాక్టర్ ఎం. వెంకటేశ్వరరావులు తెలిపారు. జాతీయ పోటీల్లో రాష్ట్ర క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి తవిటయ్య, పీడీలు గోపాల్, శ్రీను, శివ, తిరుపతిరావు పాల్గొన్నారు.

- సంప్రదాయంగా జగన్నాథుని స్నానయాత్ర
- గజానన అలంకరణలో దర్శనమిచ్చిన మూల విరాట్‌లు
- తండోప తండాలుగా తరలివచ్చిన భక్తులు
- యాత్రికుడి మృతితో మరోసారి శుద్ధి

దేదీప్యమానం.. దేవస్నానం





కిక్కిరిసిన జగన్నాథుని స్నానోత్సవ మేఘనాథ మండపం(ఇన్‌సెట్లో) మూల విరాట్‌లకు ఒబొకాసా సేవ



స్నాన మండపంపై గజానన అలంకారంలో మూలవిరాట్



సేవాయత్‌ల ప్రత్యక్ష పర్యవేక్షణలో స్వామి స్నానోత్సవం



స్నానోత్సవంలో వడదెబ్బ నివారణ చర్యలు



భక్తులకు అభివాదం చేస్తున్న పూరీ గజపతి మహారాజా దివ్యసింఘ్ దేవ్

భువనేశ్వర్: జగన్నాథుడు, అతని తోబుట్టు దేవతల మహాస్నాన(స్నాన) ఉత్సవం వేడుగ్గా నిర్వహించారు. ఏటా జ్యేష్ఠ పూర్ణిమ పురస్కరించుకుని జగన్నాథుని స్నానోత్సవం నిర్వహిస్తారు. అయితే ఈ ఏడాది ఒకేసారి సామికి వరుసగా రెండుసార్లు ఆచార వ్యవహారాలతో సుభాషిత జలంతో అభిషేకించాల్సి వచ్చింది. స్నానమండపం సమీపంలో రక్తపు మరక కనిపించింది. దీంతో ఇలా చేయడం అనివార్యమైంది. అంతకుముందు ఈ ప్రాంగణం శుద్ధి చేసి, ప్రత్యేక పూజాదులను నిర్వహించారు. జగన్నాథ స్వామి, బలభద్రుడు, దేవీ సుభద్ర మూల విరాట్‌లతో స్వామి ఆయుధ సుదర్శన చక్రాల ప్రత్యేక పూజాదులు ముందస్తు షెడ్యూల్ ప్రకారం సకాలంలో జరిగాయి. అలాగే రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో దేవస్నాన పౌర్ణమి సందర్భంగా జగన్నాథునికి స్నానోత్సవం చేపట్టారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై, దేవదేవుని దర్శించుకున్నారు.

బంగారు బావి శుద్ధి..

శ్రీమందిరం బంగారు బావిని శుద్ధి చేశారు. స్నానోత్సవానికి ఈ జలాన్ని వినియోగిస్తారు. శ్రీమందిరం ఉత్తరద్వారం శీతల మాత ఆలయం చేరువలో బంగారు బావి ఉంది. స్వామిని అభిషేకించే ముందు బావిని శుద్ధి చేయడం ఆచారం. దీనిలో భాగంగా చెత్తా చెదారంతో పేరుకుపోయిన నీటిని తొలగించారు. చున్నం జల్లి, బావిని శుద్ధి చేశారు. ఈ నీటితో తొలుత శీతలమాత ఆలయం ప్రాంగణంలో సింహం ప్రతిమకు అభిషేకించారు. దయణమాలి వర్గం సేవకులు ఈ ప్రక్రియ నిర్వహించారు. మంగళహారతితో స్నానపూర్ణిమ క్రతువులు ప్రారంభమై ఒబొకాసా సేవ నిర్వహించారు. చతుర్ధామూర్తికి అష్టోత్తర శత(108) కలశాల ప్రత్యేక మూలికల నీటితో స్నానం చేయడంతో స్నానోత్సవ వేడుక ముగిసింది.

గజానన అలంకారం..


మహాభిషేకం తర్వాత మూల విరాట్‌లకు గజానన అలంకరణ చేశారు. రాఘవదాస్ మఠం సిద్ధం చేసిన అలంకరణ సామగ్రితో త్రిమూర్తుల మూల విరాట్‌లకు ఈ ప్రత్యేక వేషధారణతో దర్శనానికి సిద్ధం చేశారు. మరోవైపు స్వామి స్నానోత్సవానికి పలు ప్రాంతాల నుంచి భక్తులు, యాత్రికులు తండోపతండాలుగా తరలి వచ్చారు. ముందస్తుగా మారీచ్ కోట్ కూడలి నుంచి సింహ ద్వారం దిశలో ఏర్పాటు చేసిన మూడంచెల తాత్కాలిక బారికేడుల గుండా భక్తుల్ని వరుస క్రమంలో స్నాన మండపం వైపు విడిచి పెట్టారు. పూరీ జిల్లా పోలీసు సూపరింటెండెంటు ప్రత్యక్షంగా రద్దీ నియంత్రణ కార్యకలాపాల్లో పాల్గొన్నారు.

జగన్నాథునే ధ్యానిస్తూ..

గజానన అలంకరణ సమయంలో జగన్నాథ ఆలయం పోలీస్ ఠాణా జవాను స్నానమండపం వద్ద రక్తపు మరకలను గుర్తించి సేవకులకు సమాచారం అందజేశాడు. ఈ సమాచారం ధ్రువీకరించి మరోసారి మహాస్నాన కార్యక్రమాలు నిర్వహించాలని సేవకులు నిర్ణయించారు. సంప్రదాయం ప్రకారం శ్రీమందిరం ఆవరణలో రక్తపు మరకలు కనిపిస్తే దానిని శుద్ధి చేసి మళ్లీ పూజలు నిర్వహించాలి. స్నాన పూర్ణిమ సందర్భంగా ఆదివారం స్థానిక జిల్లా ప్రధాన ఆస్పత్రిలో జగన్నాథుని దర్శనం చేసుకున్న ఓ యాత్రికుడు మృతి చెందాడు. మృతుడు రాజస్థాన్‌కు చెందిన అంబల్ భోయ్‌గా గుర్తించారు. అంబాల్ స్నానమండపం దగ్గర జగన్నాథునికి ప్రార్థిస్తుండగా అకస్మాతుగా కుప్పకూలాడు. ఆయన ఆరోగ్య పరిస్థితి క్షీణించినట్లు భావించి హుటాహుటిన చేరువలో ఉన్న సింహద్వార్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అతని ఆరోగ్య పరిస్థితి మెరుగుదల కనిపించకపోవడంతో ఉన్నత చికిత్స కోసం స్థానిక జిల్లా ప్రధాన ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు మృతిచెందినట్లు ప్రకటించారు.



జగన్నాథునికి సుభాషిత జలాభిషేకం



బరంపురం: పాతాలేశ్వర్ ఆలయంలో ప్రత్యేక అలంకరణలో మూల విరాట్‌లు



పర్లాకిమిడి: జగన్నాథుని స్నాన మండపానికి తీసుకు వెళ్తున్న సేవాయత్‌లు



పర్లాకిమిడి: స్నానోత్సవంలో పాల్గొన్న భక్తులు



బరంపురం: గుసానినువాగం మందిరంలో కిక్కరిసిన భక్తులు



బరంపురం: కోర్టుపేటలో ప్రత్యే అలంకరణలో జగన్నాథ, బలభద్ర, సుభద్రా మూర్తులు



జయపురం: గజ రూపంలో పూజలందుకున్న దేవతామూర్తులు



రాయగడ: దేవస్నానం అనంతరం దర్శనమిస్తున్న దేవతామూర్తులు



అహ్లాదకరంగా పూరీ జగన్నాథ మందిర ప్రాంగణం

మహేంద్రగిరుల పరిశుభ్రతకు చర్యలు

- పాల్గొన్న కలెక్టర్, జెడ్పీ ఛైర్మన్ 200మంది విద్యార్థులు



ధర్మరాజు మందిరం వద్ద వ్యర్థాలను తొలగిస్తున్న విద్యార్థులు



మహేంద్రగిరి పర్వతంపై ప్లాస్టిక్ సేకరిస్తున్న దృశ్యం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ లింగరాజ్, జెడ్పీ చైర్మన్ తిరుపతిరావు

పర్లాకిమిడి: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా అటవీశాఖ, గజపతి డివిజన్, మిషన్ లైఫ్ సంస్థ ప్రతినిధులు మహేంద్రగిరి పర్వతంపై మెగా ప్లాస్టిక్ క్లీన్ డ్రైవ్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ లింగరాజ్ పండా, జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతిరావు, డీఎఫ్‌ఓ వి.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. మహేంద్రగిరి పర్వతాలలో పర్యాటకులు ప్లాస్టిక్ వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పారవేయరాదని కలెక్టర్ సూచించారు. పరిశుభ్రత డ్రైవ్‌లో కృష్ణచంద్ర గజపతి కళాశాల విద్యార్థులు, సెంచూరియన్ వర్సిటీ, ఎస్‌హెచ్‌జీ, మహేంద్రగిరి ఈడీసీ, పంచాయతీ ప్రతినిధులు సుమారు 200మంది పాల్గొని, రెండు ట్రాక్టర్లలో ప్లాస్టిక్ వ్యర్థాలను అక్కడి నుంచి తరలించారు. అనంతరం వివిధ మొక్కల విత్తనాలను మహేంద్రగిరి పరిసర ప్రాంతాల్లో చల్లారు.

ప్రాణం తీసిన నిద్రమత్తు!

- రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు దుర్మరణం
- కుమార్తె పరిస్థితి విషమం

కొమ్మాది/ఆరిలోవ: ఓ కుటుంబం తమ బంధువుల శుభకార్యానికి వెళ్లింది. అక్కడ రాత్రంతా సంతోషంగా గడిపారు. తిరిగి బైక్‌పై ఇంటికి బయలుదేరారు. మార్గమధ్యలో జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన కుమార్తె పరిస్థితి విషమంగా ఉంది. సాగర్‌నగర్ దరి బీచ్‌రోడ్డులో బే పార్కు వద్ద ఆదివారం తెల్లవారుజామున ఈ ప్రమాదం జరిగింది. డివైడర్‌ను ఢీకొట్టడమే ఈ ప్రమాదానికి కారణమని ఆరిలోవ పోలీసులు భావిస్తున్నారు. వారు తెలిపిన వివరాలివీ.. విజయనగరం జిల్లా భోగాపురానికి చెందిన మైలపల్లి పెద్దయ్య(30), అతని భార్య పావని(25), మూడేళ్ల కుమార్తె యక్షిత నగరంలోని జాలరిపేటలో నివాసముంటున్నారు. పెద్దయ్య కూలి పనులు చేస్తుంటాడు. సొంత ఊరులో బంధువుల వివాహం కోసం వారు ముగ్గురు కలసి బైక్‌పై శనివారం బయలుదేరి వెళ్లారు. రాత్రంతా పెళ్లిలో అందరితో సరదాగా గడిపి.. తిరిగి ఆదివారం వేకువజామున అదే బైక్‌పై నగరానికి వస్తున్నారు. జాతీయ రహదారి వద్ద ఎండాడ నుంచి రుషికొండ వెళ్లి.. అక్కడ నుంచి బీచ్‌రోడ్డులో జాలరిపేట వస్తుండగా బైక్ అదుపు తప్పింది. బే పార్కు, రాడిసన్ బ్లూ హోటల్ మధ్యలో ప్రమాదానికి గురైంది. ఈ సంఘటనలో పెద్దయ్య తలకు తీవ్ర గాయం కావడంతో సంఘటన స్థలంలోనే ప్రాణాలు విడిచాడు. కొన ఊపిరితో ఉన్న అతని భార్య పావని, కుమార్తె యక్షితను స్థానికులు గీతం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పావని మృతి చెందింది. యక్షితను కేజీహెచ్‌కు తరలించారు. యక్షిత ప్రస్తుతం అక్కడ చికిత్స పొందుతోంది. భార్యాభర్తల మృతదేహాలను పోలీసులు కేజీహెచ్‌కు తరలించారు. మృతుడు మామ ఎరుపల్లి సన్యాసి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ అప్పారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిద్ర మత్తులో బైక్ సరిగా నడపలేక డివైడర్‌ను ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు.



పెద్దయ్య మృతదేహం



మృతి చెందిన పావని

అమ్మవారికి పాలధార



ముఖాన పసుపుతో సందడి చేస్తున్న చిన్నారులు



పూజారి, పూజారమ్మల ఊరేగింపు

రాయగడ: గ్రామదేవత ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం పాలధార కార్యక్రమం సాంప్రదాయంగా నిర్వహించారు. పూజరి, పూజారమ్మలను పసుపుతో ముస్తాబు చేశారు. అనంతరం పుర వీధుల్లో ఊరేగించారు. ఈ సమయంలో ప్రజలు నిండు కుండ నీటిలో పసుపు కలిపి, ఆ నీటిని పూజారి, పూజారమ్మ లపై వేశారు. ఈ ఘట్టాన్నే పాలధారగా పిలుస్తారు. గ్రామంలో మసూచి మహమ్మారి సోకి వందలాది మందిని బలిగొంటున్న సమయంలో గ్రామప్రజలు బురదల పోలమ్మను వేడుకుంటారు. దీంతో కరుణించిన అమ్మవారు.. దుష్టశక్తులను, మశూచి మహమ్మారిని పారద్రోలేందుకు బయలుదేరుతారు. ఈ క్రమంలో దుష్టశక్తులను హతం చేస్తూ వస్తున్న అమ్మవారి ఉగ్రరూపాన్ని చూసి ప్రజలు జయజయ ధ్వానాలు చేస్తారు. అనంతరం ఆమెకు శాంతింపజేసేలా పసుపు నీళ్లత జలాభిషేకం చేస్తారు. అప్పటి నుంచి గ్రామదేవత ఉత్సవాల్లో భాగంగా ఈ ఘట్టాన్ని సంప్రదాయంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇదిలా ఉండగా అమ్మవారి ప్రతిరూపాలుగా పిలిచే చిన్నారులను ఇదే సందర్భంగా పసుపుతో అలంకరించారు. ఈ నేపథ్యంలో చేతిలో వేప కొమ్మలు పట్టుకుని చిన్నారులు సందడి చేశారు.

రూ.10.35 కోట్ల విలువైన అటవీ ఉత్పత్తుల కొనుగోలు

పార్వతీపురం టౌన్: గిరిజన ప్రాంతంలో జీసీసీ ద్వారా అటవీ ఉత్పత్తుల కొనుగోలు వేగవంతం చేస్తున్నట్లు జీసీసీ డివిజనల్ మేనేజర్ మహేంద్ర తెలిపారు. ఈ మేరకు ఆదివారం స్థానిక జీసీసీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ డివిజన్‌లోని అన్ని ప్రాంతాల్లో చింతపండు కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు ముమ్మరం చేశామని తెలిపారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యం రూ. 4.30కోట్లు కాగా లక్ష్యానికి మించి రూ.10.35 కోట్ల విలువగల ఉత్పత్తులను కొనుగోలు చేశామన్నారు. రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్న దొర ద్వారా సమస్యలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకు వెళ్లినట్లు తెలిపారు. గిరిజన రైతులు జీసీసీ నిర్వహించిన గిట్టుబాటు ధరలు పొందాలని కోరారు.

క్లుప్తంగా

కొత్త ఎంపీడీఓల నియామకం

అరసవల్లి: తాజాగా జరిగిన బదిలీల్లో భాగంగా ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని పలు మండలాలకు కొత్తగా ఎంపీడీఓలు నియమితులయ్యారని, ఒకటి రెండు రోజుల్లోనే బాధ్యతలను స్వీకరించనున్నారని జెడ్పీ సీఈఓ ఆర్.వెంకట్‌రామన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇతర జిల్లాల నుంచి కొందరు ఏఓ, ఈఓపీఆర్‌డీల నుంచి పదోన్నతులు పొంది ఎంపీడీఓలుగా వస్తున్నట్లు పేర్కొన్నారు. వీరితో పాటు సీనియర్ అసిస్టెంట్లు ఐదుగురు, జూనియర్ అసిస్టెంట్లు తొమ్మిది మంది, రికార్డు అసిస్టెంట్లు నలుగురు, ఆఫీస్ సబార్డినేట్స్ 18 మంది, నైట్ వాచ్‌మేన్లు ఇద్దరు, స్వీపర్లు ఇద్దరిని వివిధ ప్రాంతాలకు బదిలీ చేసినట్లుగా వివరించారు.

కొత్త ఎంపీడీఓలు వీరే..

ఎస్.రమణయ్య(గార), సీహెచ్.ప్రేమలత(సంతబొమ్మాళి), కె.ఉషశ్రీ(పోలాకి), కె.నిశ్చలజి.సిగడాం), ఆర్.వి.రమణమూర్తి(రణస్థలం), టి.రమాదేవి(ఎచ్చెర్ల), జి.శివప్రసాద్(నందిగాం), ఎల్.వి.అప్పారావు(జలుమూరు), ఎన్.హనుమంతరావు(ఆమదాలవలస), జి.చంద్రరావు(భామిని), జి.వి.రవికుమార్(సంతకవిటి), ఎం.రవీంద్రబాబు(బూర్జ), వి.తిరుమలరావు(మందస), జి.జయంతుప్రసాద్(వీరఘట్టం).

శ్రీముఖలింగంలో చక్రతీర్థస్నానాలు



పార్వతీ పరమేశ్వరులకు చక్రతీర్థస్నానాలు నిర్వహిస్తున్న అర్చకులు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో మధుకేశ్వరుని చక్రతీర్థస్నానాలు వంశధార నదిలో ఆదివారం ఘనంగా జరిగాయి. తొలుత పార్వతీ పరమేశ్వరులను ప్రత్యేకంగా అలంకరించి పల్లకిలో ఆశీనులుగా చేశారు. అనంతరం వంశధార నదిలో స్వామివారి సహిత వారాహి అమ్మవారికి చక్రకతీర్థ స్నానాలు నిర్వహించారు. అనంతరం దేవాలయంలో ఏకవార అభిషేకాలు చేశారు. దీంతో స్వామివారి పాంచరాత్రి కల్యాణ ఉత్సవాలు ముగిశాయి. కార్యక్రమంలో అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

'యుద్ధమే శాంతి' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రచయితలు

శ్రీకాకుళం కల్చరల్: సాహిత్యం ఏ రూపంలో ఉన్నా అంతిమ లక్ష్యం సమసమాజ నిర్మాణమే అని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చల్లపల్లి స్వరూపరాణి అన్నారు. శ్రీకాకుళంలోని కథా నిలయంలో ప్రసాదమూర్తి రచించిన దీర్ఘకావ్యం 'యుద్ధమే శాంతి' పుస్తకావిష్కరణ సభ ఆదివారం జరిగింది. ముందుగా కాళీపట్నం రామారావు ద్వితీయ వర్ధంతి సందర్భంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ పుస్తక ప్రాముఖ్యతను వివరించారు. సిక్కోలు బుక్ ట్రస్టు సంపాదకులు దుప్పల రవికుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రచయితలు మాటూరి శ్రీనివాస్, అట్టాడ అప్పలనాయుడు, గంటేడ గౌరునాయుడు, గార రంఘునాథం, కంచరాన భుజంగరావు, కాళీపట్నం సుబ్బారావు, దాసరి రామచంద్రరావు, బొడ్డేపల్లి కృష్ణారావు, చింతాడ తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

పరుగు పోటీల్లో నందిగాం విద్యార్థుల ప్రతిభ



సత్తాచాటిన నందిగాం విద్యార్థులు

నందిగాం: తిరుపతి సమీపంలోని నాయుడుపేటలో ఆదివారం జరిగిన రాష్ట్ర స్థాయి పరుగు పోటీల్లో నందిగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడాకారులు సత్తాచాటారు. నాలుగు కిలోమీటర్ల కేటగిరీ అండర్-14 విభాగంలో జి.అభిరాం ప్రథమ స్థానం, కె.గణేష్ ఐదో స్థానంలో నిలిచాడు. ఐదు కిలోమీటర్ల కేటగిరీ అండర్ -18 విభాగంలో బి.మోక్ష ద్వితీయ స్థానంలో నిలిచాడు. వీరికి నగదు, బహుమతులు అందజేసి సత్కరించారు. విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు యర్నాగుల హరిబాబు, పీడీ శ్రీనివాసరావు, ఉపాధ్యాయ సిబ్బంది, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ సనపల చిన్నారావు అభినందించారు.

క్షతగాత్రులకు వైద్యసాయం

అరసవల్లి: ఒడిశాలో రైల్ల ప్రమాద క్షతగాత్రులకు జిల్లా వైద్యారోగ్య శాఖ బృందం రెండు రోజులుగా సేవలందిస్తోంది. ప్రత్యేక ఎమర్జెన్సీ నోడల్ అధికారి డాక్టర్ రామిరెడ్డి, డాక్టర్ కొయ్యాన అప్పారావు, డాక్టర్ కార్తిక్ తదితరులతో కూడిన బృందం ఇప్పటికే సేవలు ప్రారంభించారు. బాలాసోర్‌లోని అపోలో ఆసుపత్రిలో వందలాది మంది క్షతగాత్రులుండగా.. వారికి చికిత్స అందిస్తున్నారు. ఇదిలావుంటే శనివారం రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఒడిషా పర్యటనలో భాగంగా స్థానిక జిల్లా నుంచి వెళ్లిన ఈ ఎమర్జెన్సీ బృందం కూడా మంత్రితో పాటు వెళ్లి క్షతగాత్రుల పరిస్థితులను చూసి అక్కడికక్కడే చికిత్సలను అందజేసారు.

తగ్గిన జీడి.. పెరిగిన కోడి

కాశీబుగ్గ/శ్రీకాకుళం: మార్కెట్‌లో జీడిపప్పు ధరలు ఒక్కసారిగా తగ్గుముఖం పట్టాయి. మరోవైపు చికెన్ ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. జాతీయ మార్కెట్‌లో సంక్షోభంతో జీడిపప్పు అమ్మకాలు వారం రోజులుగా గణనీయంగా పడిపోవడంతో పరిశ్రమ దారులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలోని పలాస, ఆంధ్రా-ఒడిశా సరిహద్దుల్లో సుమారు 400 జీడి పరిశ్రమలు ఉనఅనియ. జాతీయ, అంతర్జాతీయ మార్కెట్‌లో జీడిపప్పు వాడకం తగ్గడంతో పాటు, మండుతున్న ఎండలు ధరల పతనానికి కారణంగా విశ్లేషకులు చెబుతున్నారు. మొదటి రకం జీడి(గుడ్డు) ధర వారం రోజుల వ్యవధిలో కిలోపై రూ.150 వరకు తగ్గింది. వివిధ రకాల జీడిపప్పు, బద్ద, గుండ సుమారు రూ.75 వరకు తగ్గింది. ధరల తగ్గుముఖంపై పీసీఎంఏ అధ్యక్షుడు మల్లా సురేష్‌కుమార్, పలాస ఇండస్ట్రీయల్ ఎస్టేట్ అధ్యక్షుడు మల్లా రామేశ్వరం మాట్లాడుతూ ఏటా పెరిగే సమయంలో ఈసారి ధరలు తగ్గిపోయాయని చెప్పారు.

కొండెక్కిన కోడి

మాంసాహార ధరలు మాత్రలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. 20 రోజుల క్రితం ధరలతో పోలితే చికెన్ ధర రూ.80, గుడ్డు ధర రూపాయి, చేపలు ధర రకాలను పట్టి రూ.80 నుంచి రూ.100 వరకు పెరిగాయి. వేసవి కాలంలో ఇలా ధరలు పెరగటం సాధారణమే అయినా ఈ ఏడాది పెరుగుదల విపరీతంగా ఉంది. వేసవిలో వ్యాధులు సోకుతాయన్న కారణంగా పౌల్ట్రీ యజమానులు సీజన్‌లో తక్కువగా కోళ్లను పెంచుతారు. ఫలితంగా ధర పెరుగుతోంది. అలాగే ప్రస్తుతం మార్కెట్‌లో కిలో నుంచి కిలోన్నర కోళ్లు మాత్రమే అందుబాటులో ఉంటున్నాయి. వాస్తవంగా పౌల్ట్రీ యజమానులు కోడి బరువు రెండు కిలోలు దాటిన తరువాత మాత్రమే విక్రయిస్తుంటారు. ఇప్పుడు కోళ్లకు డిమాండ్ పెరగటంతో కిలో కోళ్లనే విక్రయిస్తున్నారు. వీటి రుచి కూడా తగ్గుతోందని మాంసాహార ప్రియులు చెపుతున్నారు.



● చెట్టునీడలో సేదతీరుతూ..



వేసవి ఎండలు మండిపోతున్నాయి. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వేడి గాలులు, ఉక్కపోతతో జనాలు అల్లాడిపోయారు. గొర్రెలు, మేకలు తదితర మూగజీవాలు సైతం ఎండవేడికి తట్టుకోలేక చెట్ల నీడను ఆశ్రయించాయి. ఎల్.ఎన్.పేట మండలం గొట్టిపల్లి చెరువు వద్ద గొర్రెల మంద ఇలా చెట్టు కింద సేదతీరింది. – ఎల్.ఎన్.పేట

● కంగారు పెడుతున్న కొండముచ్చులు



కంచిలి పంచాయతీలో కోతులు, కొండముచ్చుల బెడద ఎక్కువైంది. అటవీ ప్రాంతం నుంచి వచ్చి స్వైర విహారం చేస్తుండటంతో మహిళలు, చిన్నారులు, వృద్ధులు భయభ్రాంతులకు గురౌతున్నారు. ఇళ్లలోకి ప్రవేశించి వస్తువుల్ని చిందరవందర చేస్తుండటంతో ఇబ్బందులు పడుతున్నారు. సుమారు వంద వరకు కోతులు, కొండముచ్చులు తిరుగుతుండటంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. – కంచిలి

సొంతింటి కలకు.. మీటర్ల వెలుగు



విద్యుత్ మీటర్ కనెక్షన్లను పరిశీలిస్తున్న ఎస్ఈ దైవప్రసాద్

- జగనన్న కాలనీల్లో జోరుగా ఉచిత విద్యుత్ మీటర్ల ఏర్పాటు
- జిల్లాలో 25,482 గృహాల నిర్మాణాలు పూర్తి
- ఇప్పటికే 24,589 విద్యుత్ మీటర్ల ఏర్పాటు
- ఆనందంలో లబ్ధిదారులు



అరసవల్లి: పేదల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోంది. ముఖ్యంగా పేదల సొంత ఇంటి కల నెరవేర్చేందుకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తోంది. కేవలం ఇంటి స్థలం ఇచ్చి చేతులు దులిపేసుకోకుండా పునాది స్థాయి నుంచి ప్రారంభం దాకా అడుగడుగునా అండగా నిలుస్తోంది. దీనిలో భాగంగా విద్యుత్ మీటర్లను ఉచితంగా అమర్చుతూ లబ్ధిదారుల్లో ఆనందాల వెలుగులు నింపుతోంది. ఈ ప్రక్రియ జిల్లాలో జోరందుకుంది.

చకచకా మీటర్ల ఏర్పాటు..

సొంత ఇళ్లు లేని పేద, సామాన్య, మధ్యతరగతి వర్గాల ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం జగనన్న కాలనీల్లో స్థలాలు మంజూరు చేసింది. ఇప్పటికే కొందరు ఇళ్లను నిర్మించుకుంటే.. మరి కొందరు నిర్మాణాలను వేగవంతంగా చేపడుతున్నారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ఈగృహ యజ్ఞంతో పేదల కళ్లల్లో వెలుగులు నిండుతున్నాయి. జగనన్న కాలనీల్లో ప్రతి ఇంటికి ఉచితంగా విద్యుత్ మీటర్లను అమర్చుతున్నారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో 877 లేఅవుట్లకు గాను శ్రీకాకుళం డివిజన్‌లో 239, టెక్కలి డివిజన్‌లో 475, పాలకొండ డివిజన్‌లో 163 లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలకు సిద్ధం చేశారు. ఇందులో కోర్టు కేసుల్లో 78, సుడా పరిధిలోని 88 లేఅవుట్లు ఉన్నట్లు గుర్తించారు. మిగిలిన 711 లేఅవుట్లలో విద్యుత్ శాఖ విద్యుద్దీకరణ పనులు చేపట్టింది. మొత్తం 179 లేఅవుట్లులో ఇప్పటికే విద్యుత్ పనులు పూర్తయ్యాయి. లేఅవుట్లలో 50,959 ఇళ్లను, సొంత స్థలాల్లో 42,721 ఇళ్లను గుర్తించారు. ఇందులో లేఅవుట్ల స్థలాల్లో 2497 ఇళ్లు పూర్తికాగా 1822 ఇళ్లకు విద్యుత్ మీటర్లను ఉచితంగా అమర్చారు. సొంత స్థలాల్లో 22,985 ఇళ్లు పూర్తి కాగా 22,767 ఇళ్లకు మీటర్లను ఉచితంగా అమర్చారు. మొత్తం 25,482 ఇళ్లకు గాను 24,589 ఇళ్లకు మీటర్లను అమర్చారు.

శత శాతం అందిస్తాం..



జగనన్న కాలనీల్లో వంద శాతం ఇళ్లకు ఉచితంగా విద్యుత్ మీటర్లను అందజేస్తాం. ఇప్పటికే పూర్తయిన ఇళ్లతో పాటు ఇళ్ల నిర్మాణాలకు వీలుగా నీటి మోటార్లకు కూడా మీటర్లు అందజేశాం. త్వరలోనే అన్ని ఇళ్లకు మీటర్లు ఏర్పాటు చేస్తాం. రాష్ట్ర ప్రభుత్వం లక్ష్య సాధన మేరకు పనిచేస్తున్నాం.

– ఎల్.దైవప్రసాద్, ఎస్ఈ, విద్యుత్ సర్కిల్

జగనన్న కాలనీలపై ప్రత్యేక దృష్టి..

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న కాలనీల నిర్మాణాల్లో విద్యుత్ శాఖ తన వంతుగా సర్వీసులను అందజేస్తూనే.. ప్రతి కాలనీల్లోనూ విద్యుత్ వెలుగులు నిండాలని ప్రత్యేక దృష్టి పెట్టింది. ఈ మేరకు విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాలు, మార్గదర్శకాల ప్రకారం స్థానిక సర్కిల్ ఎస్ఈ ఎల్.దైవప్రసాద్ విద్యుత్ సర్వీసులపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఇందుకోసం ప్రత్యేక బృందంగా అధికారులు జిల్లాలో డివిజన్ల వారీగా లేఅవుట్లను పరిశీలిస్తూ వీలైనంతగా అన్ని కాలనీల రోడ్లకు ఇరువైపులా విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు (డీటీఆర్)తో పాటు నీటి అవసరాలకు మీటర్ కనెక్షన్లను, ప్రతి ఇంటికి ఉచితంగా విద్యుత్ కనెక్షన్ మీటర్లను అందజేసేలా చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకున్న ఇళ్లకు దాదాపుగా విద్యుత్ మీటర్లు అమర్చేశారు. మిగిలిన ఇళ్లకు కూడా త్వరలోనే విద్యుత్ మీటర్లను అమర్చేలా షెడ్యూల్ సిద్ధం చేశారు. ప్రతి వారం ఈ అంశంపై ప్రగతి నివేదికలను క్షేత్ర స్థాయి నుంచి తెప్పించుకుంటూ, టెలికాన్ఫరెన్స్‌ల ద్వారా సూచనలను, ఆదేశాలను జారీ చేస్తున్నారు.

భానుడి దర్శనానికి బారులు

● అరసవల్లిలో జ్యేష్ట ఆదివారం సందడి

అరసవల్లి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి సూర్యనారాయణ స్వామి సన్నిధిలో జ్యేష్ట మాస ఆదివారాన వేలాది మంది భక్తులు తరలివచ్చి స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎండను సైతం లెక్క చేయకుండా ఇతర ప్రాంతాల నుంచి సైతం తరలివచ్చిన వందలాది మంది భక్తులు తమ కుటుంబాలతో సహా మొక్కులు చెల్లించుకున్నారు. అంతరాలయంలో స్వామి వారి మూలవిరాట్టుకు ప్రత్యేక అలంకరణలతో సర్వదర్శనాలకు ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. భక్తుల గోత్రనామాలతో పూజలు చేయించారు. సంపూర్ణ ఆరోగ్యం కోసం కొందరు భక్తులు సూర్యనమస్కార పూజలు చేయించుకున్నారు. భానుడి ప్రతాపం తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ఆలయానికి వచ్చిన ప్రతి భక్తునికి ఉచితంగా మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ఈవో వి.హరిసూర్యప్రకాష్ ప్రారంభించారు. క్యూలైన్ల వద్ద కూడా మంచినీటిని అందుబాటులో ఉంచారు. కేశఖండన శాలలో భారీగా భక్తులు తరలివచ్చి తలనీలాలు సమర్పించుకున్నారు. మొక్కుచెల్లించుకున్న యలమంచిలికి చెందిన ఓ భక్తుడు క్యూలైన్‌ను దాటేందుకు దూకడంతో తలకు గాయమయ్యింది. వెంటనే ఆలయ సిబ్బంది డాక్టర్ మోహన్‌ను పిలిపించి ప్రథమ చికిత్స చేయించారు. ఆలయ పాలకమండలి సభ్యులు మండవిల్లి రవి, ద్వారపు అనూరాధా అజిత్, ఎన్.కోటేశ్వర చౌదరి తదితరులు దర్శన ఏర్పాట్లు పరిశీలించారు. ఒక్కరోజులో ప్రత్యేక, విశిష్ట దర్శనాల టికెట్ల ద్వారా రూ.4,60,900, విరాళాలు, పూజల ద్వారా రూ.56,049, లడ్డూ, పులిహోర ప్రసాదాల ద్వారా రూ.2.50 లక్షల వరకు ఆదాయం లభించినట్లు ఈవో హరిసూర్యప్రకాష్ తెలిపారు.



భక్తులకు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేస్తున్న ఈవో హరిసూర్యప్రకాష్



కేశఖండన శాల మొక్కుల కోసం క్యూలైన్లలో భక్తులు

సృజనకు మీరే సాక్షి

ముగిసిన సాక్షి మీడియా-చిల్డ్రన్ లాఫింగ్ క్లబ్ వేసవి శిక్షణ శిబిరం



కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు

- చిత్రలేఖనం, పేపర్ క్విల్లింగ్, కూచిపూడిలో మెలకువలు నేర్చుకున్న చిన్నారులు
- ప్రతిభావంతులకు సర్టిఫికెట్లు పంపిణీ
- సాక్షి ప్రయత్నం అభినందనీయం: అతిథులు



శ్రీకాకుళం కల్చరల్ : వేసవి సెలవుల నేపథ్యంలో సాక్షి మీడియా – చిల్డ్రన్ లాఫింగ్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరాల ముగింపు కార్యక్రమం ఆదివారం కలెక్టర్ బంగ్లా ఎదురుగా ఉన్న ఆలయం వద్ద సందడిగా జరిగింది. నెలరోజులు పాటు సాగిన ఈ సమ్మర్‌క్యాంప్‌కు 100 మంది చిన్నారులు హాజరయ్యారు. చిత్రలేఖనం, పేపర్ క్విల్లింగ్, కూచిపూడి తదితర అంశాల్లో మెలకువలు నేర్చుకున్నారు. ముగింపు కార్యక్రమంలో 'సాక్షి' బ్రాంచి మేనేజర్ స్వామి మాట్లాడుతూ చిన్నారులు శిక్షణను సద్వినియోగం చేసుకుని అద్భుతమైన ప్రదర్శన ఏర్పాటు చేశారని అభినందించారు. టీపీఎంహెచ్ స్కూల్ హెచ్ఎం చంద్రశేఖర్ మాట్లాడుతూ సేవా దృక్పథంతో కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. లయన్ నటుకుల మోహన్ మాట్లాడుతూ చిన్నారులు చాలా ఉత్సాహంగా నేర్చుకున్నారని, వారికి బహుమతులు, ధ్రువపత్రాలు అందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో నిర్వాహకులు నిక్కు హరిసత్యనారాయణ, గుత్తు చిన్నారావు, బీఎంఎస్ పటాన్నాయక్, ఎల్.నందికేశ్వరరావు, టి.నీరజా సుబ్రహ్మణ్యం, పెంకి నాగేశ్వరరావు, దుర్గాప్రసాద్, ఎల్.దీప్తి, సాయిప్రసాద్, మానస, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ప్రదర్శనలు..

నెలరోజుల పాటు తాము నేర్చుకున్న కళలను ప్రదర్శించి చిన్నారులు ప్రతిభ నిరూపించుకున్నారు. జానపదం, కోలాటం, కూచిపూడి ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సంగీతం నేర్చుకున్న చిన్నారులు పలు గీతాలను శ్రావ్యంగా ఆలపించారు. చిత్రలేఖనం, పేపర్ క్విల్లింగ్ నేర్చుకున్న చిన్నారులు తాము గీసిన బొమ్మలను, చేసిన వస్తువులను ప్రదర్శనలో ఉంచారు. వీటిని చూసేందుకు చిన్నారుల తల్లిదండ్రులు ఆసక్తి కనబరిచారు.



చిన్నారులు వేసిన డ్రాయింగ్‌లను పరిశీలిస్తున్న అతిథులు



థ్యాంక్స్ టు సాక్షి



నేను కొన్నాళ్లుగా ప్రతి వేసవి శిబిరానికి శిక్షణ కోసం వస్తున్నాను. బొమ్మలు వేయడం చాలా ఇష్టం. శిక్షణలో ఎన్నో మెలకువలు నేర్పారు. నాకు బహుమతి కూడా వచ్చింది. 'సాక్షి'కి ధన్యవాదాలు. – హితేష్, పెయింటింగ్‌లో శిక్షణ పొందిన చిన్నారి

ప్రతిభ వెలికితీసేందుకే..



సాక్షికి ప్రత్యేక ధన్యవాదాలు. లాఫింగ్ క్లబ్‌కు నావంతు సహకారం అందిస్తున్నాను. చిన్నారుల్లో ప్రతిభను వెలికితీయడం మా ఉద్దేశం. 19 ఏళ్లుగా చిన్నారులను వివిధ కార్యక్రమాల ద్వారా ప్రోత్సహిస్తున్నాం. – నటుకుల మోహన్, క్లబ్ నిర్వాహకులు

ఆనందంగా ఉంది..



వేసవి సెలవుల్లో డ్యాన్స్ నేర్చుకోవడం ఆనందంగా ఉంది. నృత్యంలో చాలా మెలకువలు నేర్పించారు. చిన్నారులంతా శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు. సాక్షికి ధన్యవాదాలు. – జ్యోత్స్న, నృత్యం నేర్చుకున్న విద్యార్థి

నాట్యంలో శిక్షణ



నృత్యంలో శిక్షణ ఇచ్చేందుకు నిర్వాహకులు కోరగా నా శిష్యులను ఇద్దరిని పంపించాను. చిన్నారుల కోసం మంచి కార్యక్రమం నిర్వహిస్తున్నారు. నాట్యంలో చిన్నారులు మెలకువలు నేర్చుకున్నారు. – టి.నీరజ, అభినయ నృత్యనికేతన్ నృత్య దర్శకురాలు

చక్కగా నేర్పించారు..



ఈ వేసవి సెలవుల్లో నా కుమార్తెను నృత్యం నేర్చేందుకు శిక్షణ శిబిరానికి పంపించాను. చాలా చక్కగా నేర్పారు. ప్రతి ఏడాది వేసవి శిబిరాలకు పంపుతున్నాను. సాక్షికి ప్రత్యేక ధన్యవాదాలు. మరిన్ని మంచి కార్యక్రమాలు చేయాలి. – పొట్నూరు శిరీష, విద్యార్థి తల్లి



● కన్నీటి నివాళి



ఒడిశా రైలుప్రమాద బాధితులకు సంతాపంగా కవిటిలో ఆదివారం రాత్రి కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు. మండల కోఆప్షన్ సభ్యుడు పాండవ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం కొవ్వొత్తులు వెలిగించి మృతుల ఆత్మకు శాంతి కూరాలని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. – కవిటి

మృత్యు పిడుగులు

- వేర్వేరు చోట్ల ఇద్దరు మృతి
- ఎగిరిపడిన ఇళ్ల పైకప్పులు

బూర్జ: జిల్లాలో వేర్వేరు చోట్ల పిడుగుపాటుకు గురై ఇద్దరు మృతిచెందారు. బూర్జ మండలం లాభాం గ్రామానికి చెందిన నక్క పద్మావతి (5) ఆదివారం సాయంత్రం ఆవును మేపేందుకు గ్రామ సమీపంలోని పొలానికి వెళ్లింది. ఈ సమయంలో ఒక్కసారిగా పిడుగు పడటంతో పద్మావతి అక్కడికక్కడే మృతి చెందింది. ఆవు సైతం మృత్యువాతపడింది. పద్మావతికి ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. అందరికీ వివాహాలు అయ్యాయి. భర్త చిన్నరామయ్య రెండు నెలల కిందట అనారోగ్యంతో మృతిచెందాడు. పెద్దకుమారుడు నక్క కృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై బి.అశోక్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు.






ఘటనా స్థలంవద్ద పద్మావతి, ఆవు మృతదేహాలు (ఇన్‌సెట్లో) పద్మావతి (ఫైల్)

తూలుగు పంచాయతీలో..

గార: గార మండలం తూలుగు పంచాయతీకి చెందిన కొయ్యాన చిన్నప్పన్న (48) పిడుగుపాటుకు గురై మృతిచెందారు. పొలం నుంచి ఇంటికి వస్తున్న సమయంలో చిన్నప్పన్నపై పిడుగుపడింది. కొనఊపిరితో ఉన్న చిన్నప్పన్నను ఇంటికి తీసుకొచ్చి ప్రథమ చికిత్స అందించినప్పటికి ఫలితం లేకపోయింది. మృతుడికి భార్య మంగమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. అదే విధంగా, గ్రామ సమీపంలోని వాడపాలెంలో లాడి నాగభూషణరావు ఇంటిపై పిడుగు పడడంతో కుటుంబ సభ్యులు తీవ్ర భయాందోళన చెందారు. ఎవరికీ ప్రమాదం జరగక పోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.



చిన్నప్పన్న (ఫైల్)

ఈదురుగాలుల బీభత్సం

మెళియాపుట్టి: మండలంలోని ఆంపురం పంచాయతీ పెంగువాడ గిరిజన గ్రామంలో శనివారం రాత్రి ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. పెద్ద బొంతు కాంతమ్మ, జగదాంబలకు చెందిన ఇళ్ల పైకప్పులు ఎగిరిపోవడంతో వర్షం నీరంతా చేరి తీవ్ర



పెంగువాడలో ఎగిరిపడిన ఇంటి రేకులు